# లంచం ఇవ్వడం తప్పా? పుచ్చుకోవడం తప్పా?

"రాధా! మన క్లాస్‌మేట్ సుగుణాకర్ నీకు జ్ఞాపకం ఉన్నాడుగా! పరిస్థితులు అనుకూలించకపై చదువులకి స్వస్తి చెప్పి, ఇంటర్ లోనే కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు గుర్తుందా?"

"అవును శోభితా! ఆర్థికంగా వాళ్ళు చాలా బాధల్లో వుండేవారు. ముగ్గురో నలుగురో పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు! తాగుబోతు తండ్రి. రోగిష్టి తల్లి! పాపం సుగుణాకర్ మధ్యాహ్నం టిఫిన్ కూడా తెచ్చుకునేవాడు కాదు కదూ!"

"అదే కుటుంబ పోషణ కోసం చదువు మానేశాడు కానీ లేకపోతే వాడు బ్రిలియంట్ ఫెలో! చాలా హానెస్టు, సిన్సియరూ కూడా! అటువంటి మనిషి ఈ పనిచేశాడంటే నమ్మలేకుండా వున్నాను"

"అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది! పోనీ ఒకవేళ కక్కుర్తి పడ్డాడే అనుకుందాం! ఏదో వందలూ వేలూ తీసుకోవడానికి ప్రయత్నిస్తాడు కానీ ముష్టి యాభై రూపాయల లంచం తీసుకున్నాడనీ, అందుకు సస్పెండ్ అయ్యాడనీ, చెప్పడానికే సిగ్గుగా ఉందసలు. అలా జరిగుండదు. ఏదో అన్యాయం జరిగి పోయుంటుంది"

"మనం వాళ్ళింటికెళ్ళి అసలు సంగతేమిటని అడిగితే?"

"ఒద్దు, బాగుండదు" అంది శోభిత! అంతలో శోభిత భర్త త్రినాథ్ వచ్చాడు శోభితని పికప్ చేసుకోవడానికి.

"సుగుణాకర్ కలిశాడు అబిడ్స్‌లో" అన్నాడు. ఒక్కసారిగా రాధా, శోభితా "ఎక్కడ? ఏమన్నాడు? అసలేం జరిగిందట?" లాంటి ప్రశ్నలు వేశారు గుక్క తిప్పుకోకుండా.

"అబిడ్స్‌లో డాక్టర్ రామరాజు గారి క్లినిక్‌లోకి వాళ్ళమ్మగారిని తీసుకెళుతున్నాడు. అతను దిగిన ఆటో దగ్గరే నా స్కూటరుండాలి. నన్ను చూసి తలొంచుకున్నాడు. నేనే వెళ్ళి పలకరించాను".

"ఆ వార్త సంగతి అడగకపోయారా?"

"అడిగాను. నిజమేనట!"

"ఆ...!" నోరు తెరిచారు శోభితా, రాధా ఒక్కసారిగా.

"వాళ్ళమ్మగారి మందులకి డబ్బులు లేక, ఉన్న అప్పులే తీర్చలేకపోవడం వల్ల, ఎక్కడా అప్పు పుట్టక అవస్థ పడుతున్న సమయంలో, రాంగ్ సైడున లైటూ బ్రేకులూ లేకుండా సైకిలు నడిపించుకు పట్టుబడ్డ ఒక కుర్రాడు, పట్టుకున్న తన సైకిల్‌ని వాపసివ్వమని అడిగితే 'యాభై రూపాయలిస్తే ఇస్తానన్నాడట.

వెంటనే ఆ కుర్రాడు యాభై రూపాయలు ఇచ్చి, అరగంట తిరక్కుండా ఎవరో సిబిఐ ఆఫీసర్‌ని వెంటబెట్టుకొచ్చి నోటు నెంబరుతో సహా చెప్పి, తగిన సాక్ష్యాలతో అతణ్ణి పట్టించేశాడుట. పాపం! వెంటనే అతణ్ణి సస్పెండు చేశారు" అన్నాడు.

"రాధా! వేలూ లక్షలూ కొట్టేస్తున్నారు ఎందరో పెద్దపెద్దవాళ్ళు పెద్దపెద్ద వేషాలతో! పెద్దమనుషుల్లా చెలామణీ అవుతున్నారు! పాపం! విధిలేక తీసుకున్న ఈ కాస్త లంచంకోసం ఇంత చెడ్డపేరు తెచ్చుకోవడమే కాదు. మొదటికే మోసం, ఉన్న ఉద్యోగం కూడా ఊడింది సుగుణాకర్‌కి"

"అసలు ఈ లంచాలు ఇచ్చేవాళ్ళని శిక్షించాలి! వాళ్ళ అవసరాల కోసం, వాళ్ళ పనులకోసం ఎదుటివారికి లేనిపోని ఆశలు కల్పించి, టెంప్ట్ చేయడం, అడ్డుతోవలగుండా పనులు సాధించుకుని పైకి రావడం! ఛీ... ఛీ...!" అసహ్యించుకుంటూ అంది శోభిత.

అలా అనడానికి కూడా వీలు లేదే! లంచం ఇచ్చేవాళ్ళకి మాత్రం ఊరికే

డబ్బు పోవడం సరదాగా ఉంటుందా? కాకపోతే ఒక పనికి వందసార్లు తిరగడం చాతకాక! టైము లేకా, ఏదో కొంత పారేసి పన్లు చేయించుకుందాం అనుకుంటారు. అయితే ఇదొక పెద్ద 'ర్యాకెట్టు'గా మారింది. కొన్ని కొన్ని పదవులలో ఇది కంపల్సరీగా తయారైంది!

అవతలివాడి అవసరాల నాడిని గుర్తించిన పెద్దమనుషులు, లంచాలిస్తే గానీ పన్లు ముట్టుకోనంత మేకులుగా తయారయ్యారు. అది తెలుసుకున్నవాళ్ళు, ముందే ఎంతో కొంత సమర్పించుకుని, పన్లు చేయించుకుని బయటపడుతున్నారు. పని కావడం, లంచం ఇచ్చేవాడి లక్ష్యం! లంచం పొందడం పని చేసేవాడి లక్ష్యం! ఈ రెండూ ఒకదానితో ఒకటి పోటీపడి, నీతీ, భీతీ, న్యాయం, ధర్మం అనే ప్రతి నియమాలనూ తోసిపుచ్చేస్తున్నాయి. రూకబలం వున్నవాడే ఈ పోటీలో నెగ్గుతున్నాడు. లేనివాడు నానా బాధలూ పడుతున్నాడు! ఇదొక విషవలయం!" అంది రాధ.

"అవును! కానీ దీన్ని ఛేదించే మార్గం ఆలోచించాలిగా! ప్రభుత్వం అసలు లంచం తీసుకున్న వాళ్ళనే కాదు. ఇచ్చేవాళ్ళనీ శిక్షించాలి.

"కరెక్ట్! అలా వుంటే చాలామటుకు పరిస్థితులు మారుతాయి. కానీ, అసలు ఎవరిపాటికి వారు, అవినీతికి పాల్పడకుండా వుండటం, కష్టపడి పని చెయ్యడం, సొంత లాభము కొంత మాని పొరుగువాడికి సాయపడటమూ చేస్తే అంతా బాగుంటుంది. ప్రతి మనిషికి కాస్తంత ఆత్మ విమర్శ అవసరం!" అంది రాధ.

*